# వీళ్ళూ మనుషులే !

కుక్కి మంచం మీద పడుకున్నాడు వీరాస్వామి. అలా పడుకోవటం వల్ల అతనికి ఇంటి కప్పు కనిపిస్తోంది. ఇంటి కప్పుకి ఉన్న చిల్లులూ కనిపిస్తున్నాయి. చిల్లుల్లోంచి పడే చినుకులూ కనిపిస్తున్నాయి.

"ఇల్లు నేయించాలి" అనుకున్నాడు వీరాస్వామి. ప్రతి సారీ వాన కురుస్తున్నపుడల్లా వీరాస్వామి మనసులో అనుకునే మాట అది. ఆచరణలోనికి రాకుండా మనసులోనే వుండి పోతున్న మాట అది.

రెండుపూటలా కడుపునిండా తిండీ, కట్టుకోవడానికి చాలినంత బట్టా లేని వీరాస్వామి కనీసావసరాలలో మూడవదైన ఇంటికోసం ఆలోచన తప్ప ఆచరణ ఏం చేయగలడు?

చూపు మరల్చి చుట్టూ కలయ చూసాడు వీరాస్వామి. ఇంచుమించు ఇల్లంతా వాన కురుస్తోంది. మట్టి నేల మీద గుంటలు పెద్దవై బాగా నీరు నిలిచి పోతోంది. మంచం కిందకు చెయ్యిపెట్టి చూశాడు వీరాస్వామి, ఏదో గుర్తుకొచ్చి - అలాగే పడుకుని వున్నారు సుశీల, నారాయణగాడు వాళ్ళిద్దరూ వీరాస్వామి పిల్లలు. కడుపులోని ఆకలికీ బైటవేసే చలికీ రాజీ కుదరక ముడుచుకుని, పడుకున్నారు-వీరాస్వామి పడుకున్న మంచంకిందే గోనెపట్టా పరుచుకుని. మంచంకిందే మరో మూల వీరాస్వామికి కనబట్టం లేదుకాని, ఓ పిల్లి కూడ పడుకుంది.

వీరాస్వామి, భార్య, పిల్లలు కడుపు నిండా అన్నంతిని చాలా రోజులైంది. కడుపు నిండా కాకుండా అన్నంతిని ప్రస్తుతం మూడు రోజులైంది. గంజి తాగి రెండు పూటలైంది.

మూడేళ్ళ క్రితం—

వీరాస్వామి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నప్పుడు-వీరాస్వామికి క్షయ జబ్బు రానపుడు —

ఆ సంసారం బాగానే వుండేది. వీరాస్వామి భార్య గంగి కూడా రెండు మూడిళ్ళల్లో పనిచేసి భర్త వేణ్ణీళ్ళకి, చన్నీళ్ళుగా ఏదో సాయం చేసేది.

ఎవరిదో నిర్లక్ష్యానికి—

ముందు వీరాస్వామి కాళ్ళు, ఆ తరువాత ఉద్యోగం రెండూ పోయాయి.

అప్పటికే ఫ్యాక్టరీ పొగవల్ల విపరీతంగా దగ్గే వీరాస్వామి తనకు వచ్చింది క్షయజబ్బని తెల్సుకోటానికి ఎంతో కాలం పట్టలేదు. తెలుసుకుని చేసిందీ ఏమీలేదు.

ఫ్యాక్టరీవాళ్ళు వీరాస్వామి కాళ్ళకు కట్టిన ధర నూట యాభై రూపాయలు. నూట యాభై రూపాయలు ఈ రోజుల్లో ఒక కుటుంబాని కెన్ని రోజులు వస్తాయనే ఆలోచన ఫ్యాక్టరీ మేనేజిమెంటుకి రాలేదు. ఎందుకంటే కాళ్ళు విరిగింది ఓ కార్మికుడిగ్గాని, మేనేజిమెంటు క్కాదు.

ఇప్పుడు పది పన్నెండిళ్ళల్లో పని చేస్తోంది గంగి. గంగి చన్నీళ్ళు వేన్నీళ్ళయ్యాయి.

వీరాస్వామి వేణ్ణీళ్ళు కనీసం చన్నీళ్ళు కూడా కాలేక పోయాయి. ఆకాశం అప్పుడప్పుడు మెరుస్తోంది. ఉండుండి ఉరుముతోంది. పేదవాడి స్థితిని తలచుకుని బాధపడినట్టు విపరీతంగా ఏడుస్తోంది కాని ఇవేవీ వినపడటంలేదు వీరాస్వామికి.

తన కుటుంబం గురించి గుండె చేసే రొద వినిపిస్తోంది. ఆకలితో పేగులు చేసే శబ్దాలు వినిపిస్తున్నాయి. పక్కింటి మంగమ్మగొంతు గట్టిగా, వీటన్నిటికంటె మిన్నగా వినిపిస్తోంది-

"చిగ్గులేక పోతే సరి, కిందటోరమే తీరిచేత్తానని తీచికెల్లిన మానెడు నూకలూ ఇవ్వనేక పోయావుగానీ మల్లీ గిద్దెడు నూకలంటూ ఏ మొగం పెట్టుకొచ్చినావే?"

చెవులు రిక్కించి విన్నాడు వీరాస్వామి, గంగి—తన గంగి ఏమంటుందోనని—

"పున్నమికి జీతం వత్తాది. తీరిచేత్తా మంగమ్మగోరూ—

తన మీద తనకే కోపం వస్తోంది వీరాస్వామికి.

"ఆ తీరిచేత్తావు తీరిచేత్తావు"

"ఈ ఒక్క పాలికే కనికరించు తల్లీ, నా కోసరంగాదు నా బిడ్డం కోసరం, ఆ రోగిస్టోడి కోసరం."

వీరాస్వామి మనసు బాధతో మూలుగుతోంది.

"ఉండు చ్చుకారపూ్పట, ఎదవగోల నుపూ్వను" అంటూ మంగమ్మ తెచ్చి అరగిద్దెడు నూకలు గంగి ఒళ్ళో పెస్తు అంది "అర గిద్దెడే వున్నాయి. అట్టుకెళ్ళు"

నూకలతో ఇంట్లోకి అడుగు పెట్టింది గంగి, పూర్తిగా తడిసి పోయి.

ఎలాగో పొయ్యి రాజేసి నిప్పుచేసి, గంజి చేసింది గంగి. ఆ గంజిని గాజు గ్లాసులో పోసి వీరాస్వామి దగ్గరకు తీసుకొచ్చింది.

"మావో తీసుకో" అంటూ.

"ఏటే అది" అంటూ గంగి మొహంలోకి చూశాడు వీరాస్వామి. అప్పుడే నైనా సరే భర్తకి, పిల్లలకి ఇంతగంజి పోయ గలుగుతున్నాననే తృప్తి నిండిన చిన్న మెరుపు వుంది ఆకళ్ళలో.

''నువు తాగి, కొంచెం పిల్లలిద్దరికీ ఇయ్యి'' అంది గంగి. అది విని సుశీల, నారాయణగారు మంచం కిందనుంచి బైటకొచ్చి ఆశగా చూస్తున్నారు తల్లినీ తండ్రినీ.

ఆకాశం మెరుస్తూనే వుంది. మధ్యమధ్య ఉరుములోనే వుంది. ఇంకా వాన కురుస్తోనే వుంది.

"నీ కేదే?" అడిగాడు వీరాస్వామి గంగిని.

"గిన్నెలో ఉన్నాది'' చెప్పింది గంగి.—

అదొక రకమైన గొంతుతో.

"ఎందుకే అబద్ధాన్నాడతావ్" అంటూ వణికే చేతులతో గ్లాసు నందుకున్నాడు వీరాస్వామి.

ఆకాశం పెద్దగా మెరిసింది. 'ఇలారా నువుకూడా కొంచెం తాగే!' అని వీరాస్వామి అంటున్నాడో లేదో, ఎక్కడో దగ్గిరలో పిడుగు పడిన చప్పుడు—

అంతే!

వణికే వీరాస్వామి చేతులు గ్లాసు నొదిలేయటంతో గ్లాసు కింద పడి పోయింది.

మట్టినేల మీద గాజు గ్లాసు పగల్లేదు. కాని అందులోని గంజి మాత్రం దక్కలేదు.

ఏమీ చేయలేని నిస్సహాయత ఆవహించింది వీరాస్వామిని.

రెండు పూటల తర్వాత, దొరక బోయిన కాస్త గంజీ పోయినం దుకు వచ్చే కోపముంది పిల్లలిద్దరి కళ్ళల్లో.

కలిగే దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నంలో తనకొంగు నోట్లో పెట్టుకో బోయి తన చీరకొంగు చిన్నదై నోటికందక పోవటంతో - ఏమీ చేయలేక అలాగే తడి నేలమీద కూర్చుండి పోయింది గంగి, మోకాళ్ళ మీద తల పెట్టుకుని.

కాని—

పీరాస్వామి మంచంకింద పడుకున్న పిల్లిమాత్రం త్వరత్వరగా వచ్చి వాన నీళ్ళల్లో కలిసి, రూపాన్ని పోగొట్టు కుంటున్న గంజిని ఆత్రంగా నాకడం ప్రారంభించింది.